ఈనాడు వికారాబాద్

విరామం లేకుండా పనిచేసేది పోలీసులే..



వేదికపై ఏఎస్పీ మురళీధర్, శిక్షణ కలెక్టర్ ఉమాహారతి, కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్, న్యూస్‌టుడే: శాంతి భద్రతల పరిరక్షణతోనే సమాజం బాగుంటుందని, విరామం లేకుండా విధుల్లో ఉండేది ఒక్క పోలీసుశాఖేనని, ప్రజల ప్రశాంతత కోసం తమ ప్రశాంతతను కోల్పోయి విధులు నిర్వహిస్తారని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయం కవాతు మైదానంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా జిల్లా ఎస్పీ నారాయణరెడ్డితో కలిసి పోలీసుల కవాతును తిలకించి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పోలీసు అమరవీరుల స్తూపంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళ్లు అర్పించి రెండు నిమిషాల మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విధి నిర్వహణలో అసువులు బాసి అమరులైన పోలీసులను సంస్మరించుకోవడం అందరి బాధ్యతని అన్నారు. సమాజంలో ప్రజలు సుఖశాంతులతో జీవనం సాగించడం వెనుక పోలీసుల పాత్ర ఎంతో ఉందన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు.

● జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి మాట్లాడుతూ సరిహద్దు సైనికులకు, పోలీసులకు పెద్దగా వ్యత్యాసం లేదన్నారు. అందరూ పండుగలు, శుభకార్యాలు చేస్తుంటే వీరు ఎవరికీ ప్రమాదం తలెత్తకుండా పహారా కాస్తుంటారన్నారు. అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, శిక్షణ కలెక్టర్ ఉమాహారతి, ఆర్డీఓ వాసుచంద్ర, ఏఎస్పీ రవీందర్‌రెడ్డి, డీటీసీ ఏఎస్పీ మురళీధర్, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలను సకాలంలో పరిష్కరించండి

వికారాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా ప్రజలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజావాణిలో అందజేసిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, శిక్షణ కలెక్టర్ ఉమా హారతితో కలిసి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి 114 అర్జీలు వచ్చాయని తెలిపారు. వాటిలో కొన్ని సత్వరమే పరిష్కరించారు. కార్యక్రమంలో ఆర్డీవో వాసుచంద్ర, జిల్లా అధికారులు శ్రీనివాసు, మల్లేశం, హన్మంత్‌రావు, శంకర్, కమలాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాన్ని సంజీవ్‌నగర్‌గా మార్చాలి

దోమ, న్యూస్‌టుడే: దోమ మండల పరిధిలోని దొంగెన్కపల్లి గ్రామాన్ని సంజీవ్‌నగర్‌గా మార్చాలని గ్రామస్థులు కోరారు. ప్రజాదర్బార్‌లో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి లెటర్‌ప్యాడ్‌పై రాసి ఇచ్చిన వినతిపత్రం అందచేశారు. ఏళ్లుగా ప్రభుత్వాలు మారుతున్నా తమగోడును వినిపించుకోవడంలేదని, సమస్యలు పరిష్కరించాలని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భాజాపా జిల్లా కార్యవర్గ సభ్యుడు రాంరెడ్డి, కృష్ణారెడ్డి, నాగేంద్రం, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

మనసులు విడివడి

అడుగులు తడబడి..

మహిళా పోలీస్ ఠాణాను ఆశ్రయిస్తున్న దంపతులు

న్యూస్‌టుడే, వికారాబాద్, తాండూర్:

నిండు నూరేళ్లు కలిసిమెలిసి ఉంటామని పచ్చని పందిరిలో, వేద మంత్రాల సాక్షిగా మంగళ సూత్రధారణతో ఒక్కటవుతున్న జంట ఆ బంధాన్ని విస్మరించి తగవులతో విడిపోయేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో పెరుగుతున్న ఈ తరహా కేసుల పరిష్కారానికి ప్రత్యేకంగా జిల్లా కేంద్రంలో 2008లో మహిళా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేశారు. దీనికి రోజుకు సగటున మూడు ఫిర్యాదులు అంటే నెలకు 90 ఫిర్యాదులు వస్తున్నాయి. కౌన్సెలింగ్ నిర్వహించి రాజీ కుదిర్చి కాపురాలు నిలబెట్టేందుకు జరుగుతున్న కృషిపై 'న్యూస్‌టుడే' కథనం.

40 శాతం మద్యం కేసులే..

మద్యం పేద, ఉన్నత అనే తేడా లేకుండా కాపురాల్లో చిచ్చు రేపుతోంది. మహిళా పోలీస్‌ఠాణాకు వచ్చే 40 శాతం కేసుల్లో మద్యం కారణంగా సమస్యలు తలెత్తి విడిపోవాలని దంపతులు భావిస్తున్నారు. సాధారణ సమయాల్లో తమ భర్తలు బాగానే చూసుకుంటారని, మద్యం తాగితే అకారణంగా కొట్టడంతో పాటు పిల్లలను సైతం నానా మాటలు అంటున్నారని చాలా మంది మహిళలు ఫిర్యాదు చేస్తున్నారు.

సంవత్సరం	కేసులు	పరిష్కారం
2021	112	80
2022	126	93
2023	92	74
2024	38	(ఇప్పటి వరకు)



కౌన్సెలింగ్‌తో కేసులు తగ్గుముఖం

భార్యాభర్తలకు కౌన్సెలింగ్‌తో కేసులు తగ్గుముఖం పడుతున్నాయి. సమస్య తీవ్రతను బట్టి సఖి, భరోసా కేంద్రాలకు పంపించి కుటుంబ పెద్దల తరహాలోనే కౌన్సెలింగ్ ఇప్పించి మాట్లాడుతున్నాం. దంపతులు ఇద్దరితో ముందుగా వేర్వేరుగా మాట్లాడి మొదట వారి సమస్యను తెలుసుకుంటున్నాం. – రవీందర్‌రెడ్డి, ఏఎస్పీ, పర్యవేక్షణాధికారి, మహిళా పోలీస్‌ఠాణా.



మరికొన్ని కారణాలు..

● ఉమ్మడి కుటుంబంలో ఇమడలేక వేరుగా జీవించాలని 20 శాతం మంది మహిళలు భావిస్తున్నారు.

● భర్త లేదా భార్య ఇతరులతో మాట్లాడినా, ఉద్యోగ రీత్యా ఎక్కువ సమయం కార్యాలయంలో ఉండాల్సి వచ్చినా, దంపతుల మధ్య విభేదాలు తలెత్తుతున్నాయి. ● జీవిత భాగస్వామి ప్రాధాన్యం ఇవ్వడం లేదని కొందరు ఫిర్యాదు చేస్తున్నారు.

ఇవిగో ఉదాహరణలు

● తనకంటే తక్కువ సంపాదిస్తున్న భర్తపై చులకన భావంతో వికారాబాద్‌కు చెందిన ఓ మహిళ వేరొకరితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. చివరకు విడాకులు కావాలని స్వయంగా ఆమే వికారాబాద్ మహిళా పోలీస్‌ఠాణాలో ఫిర్యాదు చేసింది.

● వికారాబాద్ పట్టణానికి చెందిన అతడికి భార్యపై అనుమానం కలగడంతో ఆమె చరవాణిలో కాల్ రికార్డింగ్ పెట్టాడు. కొద్ది రోజుల తరువాత ఇతరులతో ఆమె మాట్లాడిన మాటలు విన్న భర్త విడిపోవాలనుకున్నాడు. ఈ కేసు మహిళా పోలీస్‌ఠాణాకు రావడంతో ఇద్దరి మధ్య రాజీ కుదిర్చారు.


● ధారూర్‌కు చెందిన ఓ గృహిణి నిత్యం తాగి వచ్చి గొడవ పడుతూ, అనరాని మాటలంటున్న భర్త నుంచి న్యాయం కావాలని మహిళా పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించింది.

● మద్యం మత్తులో విచక్షణ మరిచి పిల్లలను, తనను హింసిస్తున్న భర్తపై చర్యలు తీసుకోవాలని మరో మహిళ ఫిర్యాదు చేశారు.



వుడా ఏర్పాటుతో జిల్లాకు మహర్దశ

న్యూస్‌టుడే, వికారాబాద్:



స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తో ముఖాముఖి

వికారాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(వుడా)ని ప్రభుత్వం ఏర్పాటుచేయడంతో జిల్లా రూపురేఖలే మారిపోతాయని, మహర్దశ పడుతుందని స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ అభిప్రాయపడ్డారు. 25 ఏళ్ల జిల్లా ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకుని ప్రగతి ప్రణాళిక రచిస్తామన్నారు. 'వుడా' రాక నేపథ్యంలో 'న్యూస్‌టుడే' ఆయనతో 'ముఖాముఖి' నిర్వహించింది. ఆ వివరాలు.. ఆయన మాటల్లోనే..

గ్రామాలతో సహా సర్వతోముఖాభివృద్ధి..

జిల్లాలోని వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ పురపాలక సంఘాలతో పాటు ఆయా నియోజకవర్గాల్లోని 493 గ్రామాలు అన్ని రంగాల్లో సర్వతోముఖాభివృద్ధి చెందుతాయి. తద్వారా పట్టణం, పల్లె అనే తేడా లేకుండా అందరికీ ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి.

పరిశీలనలో కళాశాలలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రం

విద్యార్థుల అవసరాలకు తగ్గట్లుగా తాండూరు, పరిగి ప్రాంతాల్లో పాలిటెక్నిక్ కళాశాలలు, వికారాబాద్‌లో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు ప్రతిపాదనలను పరిశీలనలో ఉన్నాయి. నియోజకవర్గానికో నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేసే దిశగా కార్యాచరణ.

వికారాబాద్, తాండూరులలో ట్రామాకేర్ కేంద్రాల ఏర్పాటు

ప్రమాదం జరిగితే సకాలంలో అత్యవసర వైద్య సేవలు లభించక రాజధానికి వెళ్లమని సిఫార్సు చేస్తున్నారు. దీంతో కాలయాపన జరిగి మార్గమధ్యనే మృత్యువాత పడుతున్నారు. ఈ పరిస్థితిని అధిగమించడానికి వికారాబాద్, తాండూరులలో ట్రామాకేర్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు.

ప్రత్యేక నిధులతో కనీస సౌకర్యాల కల్పన

అభివృద్ధికి అవసరమైన ప్రత్యేక నిధులు మంజూరు అవుతాయి. వీటితో కనీస సౌకర్యాలైన విద్య, వైద్యం, తాగునీరు, సాగునీరు, రహదారులు, ఉద్యానవనాలు, కూడళ్ల అభివృద్ధి, భూగర్భ మురుగు కాల్వల వ్యవస్థ, వీధి దీపాల ఏర్పాటు తదితరాలన్నీ ప్రణాళికాబద్ధంగా సాగేందుకు చర్యలు.

ప్రభుత్వ శాఖల వారీగా ప్రణాళికలు

రానున్న 25 ఏళ్లలో ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ శాఖల వారీగా ప్రణాళికలు రూపొందిస్తారు. ప్రత్యేక మాస్టర్ ప్లాన్‌ను రూపొందించి అమలు చేస్తారు.

మినీ ట్యాంక్‌బండ్‌లుగా అభివృద్ధి

లఖ్నాపూర్, శివసాగర్, సర్పన్‌పల్లి, కోట్‌పల్లి, కొడంగల్, తాండూరు ప్రాంతాల్లోని ఎంపిక చేసిన జలాశయాలను అభివృద్ధి చేసి మినీ ట్యాంక్‌బండ్‌లుగా తీర్చిదిద్దడం వంటివి ఉన్నాయి.

పరిగిలో నేటి నుంచి లక్ష్మీ నర్సింహ స్వామి బ్రహ్మోత్సవాలు



ముస్తాబైన ఆలయం (అంతర చిత్రంలో) కొలువైన స్వామివారు

పరిగి, న్యూస్‌టుడే: పరిగి పట్టణంలో నేటి నుంచి శ్రీలక్ష్మీ నర్సింహ స్వామి బ్రహ్మోత్సవాలు మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఇందుకోసం ఆలయాన్ని నిర్వాహకులు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మొదటి రోజు వేదస్వస్తి, యాగశాల ప్రవేశం, దీక్షాధారణ తదితరాలు జరుగుతాయని ఆలయ ధర్మకర్త ఎదిరె క్రిష్ణ తెలిపారు. బుధవారం హోమం, చివరి రోజు గురువారం స్వామివారి కల్యాణోత్సవం స్వామి వారి ఊరేగింపు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.



నిజంగా పరీక్షే..!

ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు సోమవారం నుంచి సమ్మేటివ్ అసెస్మెంట్ -1 పరీక్షలు మొదలయ్యాయి. మండల పరిధి బుద్దారం పాఠశాలలో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. చేసేది లేక ఇలా బెంచీలపై కూర్చుని పరీక్షలు రాశారు. – న్యూస్‌టుడే, పెద్దేముల్.

కొలువుదీరిన కొడంగల్ మార్కెట్ కమిటీ పాలకమండలి



కొడంగల్, న్యూస్‌టుడే: కొడంగల్ మార్కెట్ కమిటీ నూతన పాలకమండలి కొలువుదీరింది. పట్టణంలోని ఓ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో మార్కెట్ శాఖ అధికారులు సారంగపాణి సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఛైర్మన్‌గా అంబయ్యగౌడ్, వైస్ ఛైర్మన్‌గా ఆకారం వేణుగోపాల్, డైరెక్టర్లుగా సత్యనారాయణరెడ్డి, నర్సిములు, సేవ్యానాయక్, రాములు, ఆసిఫ్‌ఖాన్, వెంకట్‌రెడ్డి, చెన్నమ్మ, మల్లికార్జున్, అంజయ్య, భాస్కర్‌నాయక్‌తోపాటు ట్రేడ్ సభ్యులుగా మల్లేష్, మహేష్‌కుమార్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొడంగల్ మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, పుర ఛైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు శివకుమార్ గుప్తా, మార్కెట్ సూపర్‌వైజర్ దేవదత్తు పాల్గొన్నారు.

బ్యాంక్ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

వికారాబాద్ కలెక్టరేట్: గిరిజన సంక్షేమ శాఖ, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో బ్యాంక్ ఉద్యోగ నియామక పరీక్షల కోసం జిల్లాకు చెందిన అర్హులైన ఎస్టీ, ఎస్సీ, బీసీ అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ అందజేస్తున్నామని జిల్లా గిరిజన సంక్షేమాధికారి పి. కమలాకర్‌రెడ్డి తెలిపారు. ఈ శిక్షణ 60 రోజుల పాటు ఉంటుందన్నారు. అభ్యర్థులు స్టడీసర్కిల్.సీజీజీ.జీవోవీ.ఇన్‌లో ఆన్‌లైన్‌లో ఈనెల 27 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలని విద్యార్థుల ధర్నా

ఉపకార వేతనాలు, ఫీజు బకాయిలు తదితర అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు తరగతులను బహిష్కరించి వికారాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తా కూడలిలో రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. – న్యూస్‌టుడే, వికారాబాద్.



ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

పరిగి, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం (మిషన్ భగీరథ) ఆధ్వర్యంలో మంచినీటి సహాయకుల శిక్షణ సమావేశంలో ప్రసంగించారు. గ్రామాల్లో కొందరు ప్రధాన పైప్‌లైన్లకు ఉన్న ఫ్లో కంట్రోల్ వాల్వు (ఎఫ్‌సీవీ)లను తొలగించడంతో సరఫరా అస్తవ్యవస్తంగా మారిందని సహాయకులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీనికి ఆయన స్పందిస్తూ వాటి వద్దకు ఎవరూ వెళ్లరాదని చర్యలు తప్పవని దండోరా వేయాలని అధికారులకు సూచించారు. ఖనిజ లవణాలు కలిగిన మిషన్ భగీరథ నీటిని ప్రజలు తాగాలని కోరారు. ఈఈ చల్మారెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛత కలిగిన భగీరథ నీటి పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఈఈ సుబ్రహ్మణ్యం, గ్రిడ్ డీఈఈ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ కరీం, పరిగి, గండేడ్ మండల పార్టీ అధ్యక్షులు పరశురాంరెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అయోడిన్ ఉప్పుతో ఆరోగ్యానికి మేలు



ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ పల్వన్‌కుమార్, జీవరాజ్

వికారాబాద్ మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: ఆహార పదార్థాల్లో అయోడిన్ ఉప్పును వాడాలని, అధికంగా ఉప్పును వాడటం వల్ల అనర్థాలకు దారితీస్తుందని జిల్లా వైద్యాధికారి డాక్టర్ పల్వన్‌కుమార్ అన్నారు. సోమవారం 'ప్రపంచ అయోడిన్ లోప రుగ్మతల నివారణ దినోత్సవం' సందర్భంగా జిల్లా వైద్యాధికారి కార్యాలయం నుంచి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజుకు 5 గ్రాముల కంటే ఎక్కువ ఉప్పును వాడవద్దని తెలిపారు. పోషకాహారం, తాజాపండ్లు, కూరగాయలను, ఆకు కూరలను అన్నింటిని తగు పాళ్లలో తీసుకోవాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య, ఉప కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ పంచాయతీ సమావేశాల్లో అయోడిన్ ఉప్పు ప్రాముఖ్యం గురించి వివరించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ జీవరాజ్, ఎన్‌సీడీ కార్యక్రమ అధికారిణి నిరోష, కోఆర్డినేటర్ శ్రీనివాసు, రేణుకుమార్, జయరాం పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు రూ.36.20కోట్ల మంజూరు

బషీరాబాద్: ప్రభుత్వం బషీరాబాద్ రోడ్ల అభివృద్ధికిరూ.36.20 కోట్లు మంజూరు చేసిందని బషీరాబాద్ విపణి ఛైర్మన్ మాధవరెడ్డి తెలిపారు. బషీరాబాద్- మండల పరిధిలోని పలు ప్రాంతాలకు రోడ్లు నిర్మిస్తారన్నారు.

భాజపాతోనే దేశ పురోగతి : మాధవరెడ్డి

యాలాల, న్యూస్‌టుడే: దేశంలో భాజపాతోనే అభివృద్ధి సాధ్యమని జిల్లా పార్టీ అధ్యక్షులు మాధవరెడ్డి అన్నారు. సోమవారం యాలాల మండల పరిధిలోని రాస్నం గ్రామంలో మాజీ ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా ఆధ్వర్యంలో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమానికి మాధవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. రానున్న సంస్థాగత ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అందరం కలిసి పని చేస్తున్నామన్నారు. మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, మండల భాజపా ప్రధాన కార్యదర్శి మధుగౌడ్, నాయకులు రవి, నాగయ్యగౌడ్ పాల్గొన్నారు.

తాండూరు, న్యూస్‌టుడే: తాండూరు పట్టణంలోని బూత్ నంబర్ 139, 140లో సోమవారం జిల్లా భాజపా అధ్యక్షుడు మాధవ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి పార్టీ సభ్యత్వాలు నమోదు చేయించారు. ప్రధాని మోదీ పాలన చూసి ప్రజలు భాజపా సభ్యత్వాల నమోదుకు ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సభ్యత్వ నమోదు ప్రముఖ్ వివేకానంద, సహాయ ప్రముఖ్ బంటారం భద్రేశ్వర్, జిల్లా ఓబీసీ అధ్యక్షుడు శ్రీహరి, పట్టణ ప్రధాన కార్యదర్శి అంతారం కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ మేధ, సాంకేతిక పరిజ్ఞానంపై ఉచిత శిక్షణ

తాండూరు టౌన్, న్యూస్‌టుడే: తాండూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ విద్యార్థినులకు కృత్రిమ మేధ, సాంకేతిక పరిజ్ఞానం, మహిళా సాధికారితపై ఉచిత శిక్షణ సోమవారం ప్రారంభించారు. హైదరాబాద్‌కు చెందిన ఉమెన్ ఇన్ డేటా ప్రోగ్రాం లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షణ రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. తరగతి గదిలో సాంకేతికతను ఏకీకృతం చేయటం, విద్యార్థుల్లో అభ్యసన స్థాయి పెంచటం, నైపుణ్యాలను పెంపొందించటానికి, వ్యక్తిత్వ వికాసానికి, సామాజిక చైతన్యానికి మెలకువలు నేర్పుతారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు సంజీవులు, కళావతి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

గనులు ఫుల్లు.. ఖజానాకు చిల్లు

న్యూస్‌టుడే, తాండూరుగ్రామీణ

యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు



ఓగీపూర్‌లో నాపరాయి గనులు

తాండూరు ప్రాంతం నాపరాతి నిక్షేపాలు దేశ విదేశాల్లో పేరుగాంచాయి. ఇక్కడి ఖనిజ సంపదతో సర్కారుకు రాయల్టీ, సుంకం తదితరాల రూపంలో ఏటా రూ.100 కోట్లకుపైగా ఆదాయం సమకూరుతోంది. అయితే ఈసారి ఆ పరిస్థితి కన్పించడం లేదు. అక్రమ తవ్వకాలు, తరలింపులతో ఆదాయానికి గండిపడే దుస్థితి నెలకొంది. ఓవైపు అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు పెరుగుతుండగా, మరోవైపు కొందరు అధికారులే అక్రమాలకు ఒత్తాసు పలుకుతూ చూసీ చూడనట్లు పోతున్నారు. వెరసి లక్ష్యానికి అనుగుణంగా ఆదాయాన్ని సాధించే వాతావరణం కనిపించడంలేదు.

గనులు..	మొత్తం
నాపరాయి	160
ఎర్రమట్టి	40
సుద్ద	65
కంకర	34
గ్రానైట్	6
పలుగురాళ్లు	6

మొత్తం 5,992 ఎకరాల్లో విస్తరణ

జిల్లాలోని 20 మండలాల్లో 5,992 ఎకరాల విస్తీర్ణంలో నాపరాయి, సుద్ద, ఇసుక, ఎర్రమట్టి, కంకర, పలుగురాళ్లు, సున్నపురాయి నిక్షేపాలతో కూడిన నేలలున్నాయి. వీటిని తవ్వకాల ద్వారా వెలికి తీసేందుకు గనులు భూగర్భ వనరుల శాఖ, రెవెన్యూ, కాలుష్య నియంత్రణ మండలి, అటవీ, నీటి పారుదల అనుమతులు పొందాల్సి ఉంది. దీంతోపాటు ప్రభుత్వానికి రుసుం, సుంకం, డెడ్‌రెంట్‌లతో జమ చేయాల్సి ఉంటుంది. కానీ కొందరు రాజకీయ నాయకుల అండతో అనుమతులు పొందకుండా తవ్వేస్తున్నారు. స్థానికుల ఫిర్యాదుతో అధికారులు చర్యలకు ఉపక్రమిస్తుండగా ఫలానా పార్టీ, ఫలానా ప్రజాప్రతినిధి తాలూకు నేతలమంటూ ఒత్తిడి తెస్తున్నారు.

● ఆదాయ (రాయల్టీ) లక్ష్యం: రూ.140కోట్లు
● ఎకరాకు కట్టాల్సిన రుసుం: రూ.15 లక్షలు
● వచ్చింది: రూ.59కోట్లు
రావాల్సింది: రూ.81కోట్లు

'కడా' పరిధిలో మినహాయింపు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో 'కడా' ద్వారా ప్రత్యేక అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నారు. రుసుం, సుంకం చెల్లించకుండా ఎర్రమట్టి, కంకరను తరలిస్తుండగా ఇటీవల గనుల శాఖ సిబ్బంది నిలువరించారు. నిమిషాల వ్యవధిలో ఓ ప్రత్యేకాధికారి తాండూరులోని గనుల శాఖకు చెందిన ఓ అధికారికి ఫోన్ చేసి కడా పరిధి కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండలాల్లో ఎర్రమట్టి, కంకర తరలింపును అడ్డుకోరాదన్నారు. దీంతో వాహనాన్ని వదిలేసిన గనుల శాఖ అధికారి ఇకమీదట వాటిజోలికి వెళ్లవద్దంటూ కిందిస్థాయి సిబ్బంది మౌఖిక ఆదేశాలు జారీ చేశారు.

లక్ష్యం చేరుకునేందుకు కృషి

ఆర్థిక సంవత్సరం ఏడు నెలల్లో రూ.60కోట్లు ఆదాయం సమకూరలేదు. మిగిలిన ఐదు నెలల్లో వంద శాతం ఆదాయం సాధించాల్సి ఉంది. ఒత్తిళ్లతో పనిలేకుండా క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి అక్రమ గనులకు అడ్డుకట్ట వేస్తాం. – **సత్యనారాయణ, ఏడీ, గనులు భూగర్భ వనరుల శాఖ, తాండూరు.**

బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలి



జిల్లా గిరిజన సంక్షేమాధికారి కమలాకర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

వికారాబాద్ మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమ శాఖలో విధులు నిర్వహిస్తున్న ఏఎన్ఎంలకు బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్ కోరారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో గిరిజన సంక్షేమాధికారి కమలాకర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 నెలలుగా వేతనాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారని తెలిపారు. నాయకులు సునీల్, చిన్నమ్మ, సత్తిబాయి, సబిత, సంధ్య అనిత, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహన దొంగకు దేహశుద్ధి

పరిగి గ్రామీణ: ద్విచక్ర వాహనం చోరీ చేయడమే కాక నంబర్ మార్చి ఓ వ్యక్తి తిరుగుతుండగా దాని యజమానే గుర్తించి అతడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. స్థానికులు తెలిపిన ప్రకారం.. ఈనెల 18న అజయ్ బీజాపూర్ రహదారి పక్కన ద్విచక్ర వాహనం నిలపగా చోరీకి గురైంది. సోమవారం ఓ వ్యక్తి నంబరు మార్చి దానిపై వెళుతుండగా.. అనుమానంతో అజయ్ ఆపబోయాడు. అతను ఆపకుండా కొడంగల్ వైపు వేగంగా వెళుతుండడంతో అజయ్‌కి అనుమానం బలపడింది. వెంటనే గడిసింగాపూర్ యువకులకు మొబైల్ ద్వారా సమాచారం ఇవ్వడంతో వారు అతన్ని అడ్డగించి పట్టుకొన్నారు. చేతులు కట్టేసి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా.. వివరాలు తెలుసుకునేందుకు విచారిస్తున్నామన్నారు.

నేటి నుంచి ఉపాధ్యాయ ధర్మాగ్రహ దీక్షలు

తాండూరుగ్రామీణ: పెండింగ్ బిల్లుల పరిష్కారానికి తపస్ ఆధ్వర్యంలో నేటినుంచి ఉపాధ్యాయ ధర్మాగ్రహ దీక్ష పేరిట నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర కోశాధికారి లక్ష్మీకాంతరావు తెలిపారు.

రైతేరాజు

స్వల్పకాలం.. దిగుబడి ఖాయం

ఆలు సాగులో మెలకువలతో..



బోదెల్లో నాటుతున్న విత్తనం

న్యూస్‌టుడే, జహీరాబాద్

ఆలుగడ్డ శీతాకాలంలో పండించే స్వల్పకాలిక పంట. తక్కువ నీరే అవసరం ఉంటుంది. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో దీన్ని సాగు చేస్తుంటారు. అక్టోబరు, నవంబరు నెలలు సాగుకు అనుకూలం. విత్తనం నాటినప్పటి నుంచి కోతకు వచ్చే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను జహీరాబాద్‌లోని కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త కె.శైలజ ఇలా వివరించారు.

లోతు దుక్కితో..: పొలాన్ని లోతుగా దున్ని బాగా ఎండనివ్వాలి. దీని వల్ల నేలలో ఉండే శిలీంధ్రాలు, కలుపు గింజలు చనిపోతాయి. ఆఖరి దుక్కిలో ఎకరానికి 10 నుంచి 12 టన్నుల పశువుల ఎరువు, 20 కిలోల మలాథియాన్ పొడి చల్లి కలియదున్నాలి.

శుద్ధి తప్పనిసరి: 20 నుంచి 30 గ్రా. బరువున్న దుంపలను విత్తనంగా వినియోగించాలి. వెలుతురు ఉన్న ప్రదేశంలో ఒక రోజు ఆరబెట్టాలి. దుంపను రెండు, మూడు ముక్కలుగా కోసి లీటరు నీటిలో 2 గ్రా. చొప్పున మాంకోజెట్ కలిపి 10 నిమిషాలు నానబెట్టాలి. ఆ తర్వాత గోనె సంచులు కప్పి 24 గంటలు ఆరబెట్టాలి. 50 సెం.మీ. దూరం పాటిస్తూ బోదెలు తవ్వి నాటాలి.

● నత్రజని 16 కిలోలు, భాస్వరం 24 కిలోలు, పొటాష్ 20 కిలోలు ఎకరాలో బోదెల వెంట వేయాలి. అజోస్పైరిలమ్, పాస్ఫోబ్యాక్టీరియా 2 కిలోల చొప్పున పశువుల ఎరువుతో కలిపి వేస్తే తెగుళ్ల బెడద ఉండదు. విత్తిన 30 రోజులకు 16 కిలోల నత్రజని, 20 కిలోల పొటాష్ వేసి మన్ను ఎగదోసి నీరు అందించాలి. 50 రోజులకు ఇదే మోతాదులో వాడాలి.

నీటి తడులు..: విత్తనం నాటిన ఐదారు రోజుల్లో 2, 3 తడులు అందిస్తే బాగా మొలకెత్తుతాయి. లేదంటే పొటాటో ట్యూబర్‌మాత్ బెడద తీవ్రం అవుతుంది. మొక్క పెరిగే దశలో 7, 8 రోజులకో సారి, దుంప ఏర్పడే దశలో 4, 5 రోజులకోసారి నీరు పారించాలి.

విత్తన రకాలు

కుఫ్రి చంద్రముఖి: గడ్డ గోధుమ రంగులో ఉంటుంది. పంట కాలం 90 నుంచి 95 రోజులు.

కుఫ్రి లవకర్: స్వల్పకాలిక రకం. దుంప తెల్లగా ఉండటమే కాకుండా 70 నుంచి 75 రోజుల్లో పంట చేతికొస్తుంది.

కుఫ్రి జ్యోతి: ఈ రకం విత్తనం మధ్యకాలిక రకం. దుంప తెల్లగా ఉంటూ ఎర్లీబ్లైట్, లేట్‌బ్లైట్ తట్టుకుంటుంది. పంట కాలం 90 నుంచి 100 రోజులు.

సాగులో సందేహాలా?

సంప్రదించాల్సిన ఫోన్ నం:
93815 15588

సాగు పద్ధతులు, చీడపీడల నివారణ, సస్యరక్షణపై రైతుల ప్రశ్నలకు సిద్దిపేట తోర్నాల వ్యవసాయ పరిశోధన కేంద్రం సమన్వయకర్త విజయ్ సమాధానాలు ఇచ్చారు.

ప్రశ్న: పత్తి ఆకుల ఈనెలు నల్లగా మారుతున్నాయి. ఏం చేయాలి? – **విజయ్, గజ్వేల్**

సమాధానం: కాపర్‌ఆక్సీక్లోరైడ్ 3 గ్రా.లు, స్ట్రెప్టోసైక్లిన్ 2 గ్రా.ల మందును 10 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి. పైరు ఎదుగుదలకు ఎకరాకు 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ మొక్కలకు అందిస్తే ఫలితం ఉంటుంది. – **న్యూస్‌టుడే, చేర్యాల**

మామిడిలో చెదల నివారణ

మామిడి తోటల్లో అక్టోబరు చివరి, నవంబరు మొదటి వారం నుంచి పూత రావడం ప్రారంభం అవుతుంది. దీనికితోడు చెదలు పట్టడం, క్రిమికీటకాలు చేరడమూ మొదలవుతుంది. ఈ దశలో పూతను సకాలంలో సంరక్షించుకుంటే అధిక దిగుబడులు సాధ్యం. చెదలు పట్టడం, క్రిమికీటకాల బెడద నుంచి బయటపడేందుకు 100 లీటర్ల నీటిలో 8 కిలోల రాళ్ల సున్నం, 3 కిలోల కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా క్లోరోఫైరిఫాస్ మందు కలిపి ఒక రోజు మందు నానబెట్టాలి. ఇలా తయారైన మిశ్రమాన్ని చెట్టు కింది నుంచి రెండున్నర అడుగుల మేర మొదలు చుట్టూ పూయాలి. చెట్టుకు అవసరమైన వేడి అందుతుంది.

- న్యూస్‌టుడే, పాపన్నపేట

వేరుసెనగ పంట... లాభాలు ఇంట





సాంకేతిక పరిజ్ఞానం పాటిస్తూ, అధికారుల సూచనలతో ముందుకు సాగితే ఏ పంటలోనైనా అధిక లాభాలు ఖాయం. ఈ బాటలో నడుస్తూ వేరుసెనగ పండిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు ధారూర్ మండలం ధారూర్ స్టేషన్‌కు చెందిన పాండు. 25 ఏళ్ల కిందట ఈయన తాత దీన్ని సాగు చేయగా.. అదే సంప్రదాయాన్ని ఈయన సైతం కొనసాగిస్తున్నారు. ఈయనకు ఆరెకరాల పొలం ఉంది. ప్రతి సారి దీన్ని సాగు చేసే ముందు జనుము, పిల్లిపెసర వంటి పచ్చిరొట్టె ఎరువు పంటలను వేస్తారు. ఇవి ఏపుగా పెరిగాక కలియదున్నుతారు. దీనివల్ల భూసారం పెరిగి అధిక దిగుబడి వచ్చేందుకు దోహదపడుతోంది.

ఎకరాకు రూ.30 వేలు..

ఎకరాకు 70 కిలోల చొప్పున 6 ఎకరాలకు 420 కిలోల విత్తనం అవసరం అవుతోంది. కలుపు తీత, ఎరువులు, పురుగుమందులు తదితరాలకు ఎకరాకు రూ.30 వేల వరకు ఖర్చవుతోంది. పంట పూతదశకు నెల రోజుల ముందు జిప్సం చల్లడం వల్ల ఊడలు సులువుగా భూమిలోకి వెళ్లి కాయ పరిమాణం, నూనె శాతం పెరుగుతుంది. నీటి తడులు అందించేందుకు తుంపర పద్ధతిని ఎంచుకున్నారు. అన్ని విధాల సస్య రక్షణ చర్యలు చేపడుతుండటంతో ఎకరాకు 12 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. మార్కెట్లో క్వింటా ధర రూ.7500 పలుకుతోంది. ఈ లెక్కన ఆరెకరాలకు కలిపి రూ.5.40 లక్షల వరకు ఆదాయం వస్తోంది. పెట్టుబడి పోగా రూ.3.60 లక్షల వరకు మిగులుతోందని పాండు తెలిపారు. – **న్యూస్‌టుడే, ధారూర్**

బెండలో అంతరకృషితో ఫలితం

బెండ తోటలో కలుపును సకాలంలో తొలగించకపోతే పంట నష్టపోక తప్పదు. విత్తనాలు వేయగానే ఎకరాకు పెండిమిథాలిన్ 30 శాతం లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. 25 రోజుల తర్వాత గొర్రు లేదా గుంటకతో అంతర కృషి చేసుకోవాలి. దీనివల్ల కలుపును సులువుగా నివారించుకోవచ్చు.

– న్యూస్‌టుడే, పెద్దశంకరంపేట

నిమ్మలో గజ్జి తెగులా..

వాతావరణంలో వస్తున్న మార్పులతో నిమ్మ తోటకు గజ్జి తెగులు ఆశిస్తుంది. దీనివల్ల పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ప్రస్తుతం కురుస్తున్న వానలతో ఈ తెగులు తోటంతా త్వరగా వ్యాప్తి చెందే అవకాశం ఉంది. దీన్ని గుర్తించగానే సోకిన కొమ్మలను కత్తిరించి కాల్చేస్తే వ్యాప్తి చెందకుండా ఉంటుంది. నివారణకు పది లీటర్ల నీటిలో ఓ గ్రాము స్ట్రెప్టోసైక్లిన్, 30 గ్రాముల కాపర్‌ఆక్సీక్లోరైడ్ కలిపి 20 రోజులకోసారి వర్షాలు పూర్తిగా తగ్గే వరకు పిచికారీ చేసుకుంటే ఫలితం ఉంటుంది.

– న్యూస్‌టుడే, గజ్వేల్ గ్రామీణ

వృక్ష విలాపం!





పర్యావరణ సమతుల్యానికి వృక్షాలు ఎంతో దోహదం చేస్తాయి. ఏళ్లుగా మొక్కలు నాటి రక్షిస్తుంటేనే ఇది సాధ్యమవుతుంది. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం చిల్వేర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏళ్ల కిందట అప్పటి ఉపాధ్యాయులు, విద్యార్థులు మొక్కలు నాటి కంటికి రెప్పలా కాపాడారు. అవి ఏపుగా పెరిగి పిల్లలకు చల్లని నీడను అందిస్తున్నాయి. బడి రూపురేఖలను మార్చేశాయి. ఇన్నాళ్లు పచ్చదనానికి తోడ్పడిన పాఠశాల ఆవరణలోని 100కు పైగా వృక్షాలను దసరా సెలవుల్లో నరికేశారు. దీంతో కళావిహీనంగా మారింది. దీనిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్‌ను వివరణ కోరగా.. వాన కురుస్తున్నప్పుడల్లా నీళ్లు నిలిచిపోతుండటంతో మొరం పోయిస్తున్నామని, చెట్ల ఆకులు పడి చెత్తాచెదారం నిండుతోందని, అందుకే తొలగించామని చెప్పారు. మళ్లీ నాటుకోవచ్చని సమాధానం ఇచ్చారు.

– న్యూస్‌టుడే, అల్లాదుర్గం

పరస్పర సహకారంతో ప్రగతికి బాటలు

-జపాన్ సైన్స్ టెక్నాలజీ ఏజెన్సీ అధ్యక్షులు కజుహితో హోషిమోటో



కార్యక్రమంలో జపాన్ విద్యా సంస్థల ప్రతినిధులు, చిత్రంలో జపాన్ సైన్స్, టెక్నాలజీ(జేఎస్టీ) ఏజెన్సీ అధ్యక్షులు కజుహితో హోషిమోటో, ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్.మూర్తి

సంగారెడ్డి టౌన్: పరస్పర సహకారంతో ప్రగతికి బాటలు పడతాయని జపాన్ సైన్స్, టెక్నాలజీ(జేఎస్టీ) ఏజెన్సీ అధ్యక్షులు కజుహితో హోషిమోటో పేర్కొన్నారు. జపాన్ మంత్ పేరుతో రెండు రోజుల కార్యక్రమాన్ని ఆయన ఐఐటీ హైదరాబాద్‌లో సోమవారం ప్రారంభించి మాట్లాడారు. జపాన్ అకడమిక్ దినోత్సవాన్ని పురస్కరించుకొని 'జపాన్ నెల' కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 2014 నుంచి ఇండియాతో జేఎస్టీకి మెరుగైన సంబంధాలు ఉన్నాయన్నారు. ఇరుదేశాల మధ్య శాస్త్ర, సాంకేతిక అంశాలను ఇచ్చిపుచ్చుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. జేఎస్టీ ఆధ్వర్యంలో ఇండియాకు చెందిన యువ శాస్త్రవేత్తలకు జపాన్‌లో పర్యటించే అవకాశం కల్పిస్తున్నామన్నారు. జపాన్‌లో చదివేందుకు వస్తున్న భారతీయుల్లో 5శాతం ఐఐటీహెచ్‌కు చెందిన వారేనని వివరించారు. ఉత్పత్తులపరంగా జపాన్ బలంగా ఉందని, ఇండియా-జపాన్ కలిసి ముందుకు సాగితే శాస్త్ర సాంకేతిక రంగాల్లో అద్భుతాలు ఆవిష్కృతం అవుతాయన్నారు. జపాన్ మంత్‌లో భాగంగా తమ దేశానికి చెందిన 72 విద్యా సంస్థల ప్రతినిధులు హాజరైనట్లు వివరించారు. ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్.మూర్తి మాట్లాడుతూ జపాన్‌తో ఐఐటీహెచ్‌కు బలమైన సంబంధాలు ఉన్నాయని, ఇది రెండు దేశాలకు ప్రయోజనమని పేర్కొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అధ్యయనం


మెదక్ జిల్లాలో సివిల్ సర్వీసెస్ శిక్షణ అధికారుల పర్యటన



ఆవంచలో బతుకమ్మ ఆడుతున్న శిక్షణ అధికారులు

తూప్రాన్, నర్సాపూర్ రూరల్, కౌడిపల్లి, రామాయంపేట, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు అమలు, వాటి సత్ఫలితాలపై అఖిల భారత సర్వీస్ శిక్షణ అధికారులు మెదక్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో అధ్యయనం చేయనున్నారు. సోమవారం నాలుగు మండలాల్లోని 4 గ్రామాల్లో వారి పర్యటన మొదలైంది. వారికి ఆయా గ్రామాల ప్రజలు, స్థానిక అధికారులు ఘన స్వాగతం పలికారు. నాలుగు రోజుల పాటు అక్కడే ఉండి అధ్యయనం చేయనున్నారు. ప్రజలతో మాట్లాడి పథకాల అమలు తీరుపై ఆరా తీయనున్నారు. తూప్రాన్ మండలం మల్కాపూర్‌కు ఐదుగురు అధికారులు వచ్చారు. ఆ బృందం నాయకురాలు, ఐపీఎస్ అధికారిణి సాహిత్య ఆధ్వర్యంలో వారు పర్యటించనున్నారు. తూప్రాన్ ఎంపీడీవో శేషాద్రి, డీఎల్పీవో యాదయ్య, ఎంఈవో సత్యనారాయణ తదితరులు ఉన్నారు. ● నర్సాపూర్ మండలం ఆవంచలో సోనుపర్మార్, ప్రియాంక, అరుణ్‌కుమార్ సింగ్, భోంస్లే అక్షయ్‌దినకర్, మనీష్‌కన్నాల్ క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారు. వారికి మంగళహారతులతో ఘనస్వాగతం పలకగా, గ్రామస్థులతో కలిసి బతుకమ్మ ఆడారు. వైద్యురాలు ఫౌజియా, ఏపీవో అంజిరెడ్డి, ఏపీఎం గౌరిశంకర్, ఎంఈవో తారాసింగ్ తదితరులు ఉన్నారు. ● కౌడిపల్లి మండలం రాయిలాపూర్‌కు యోగేశ్‌కుమార్, హితేశ్ ఖండేల్‌వాల్, ఆశిష్‌కుమార్, మోహినుల్లా అన్సారీ, సౌవిక్ బృందం వచ్చింది. రామాయంపేట మండలం ప్రగతి ధర్మారానికి మరో నలుగురు శిక్షణ అధికారులు వచ్చారు. ఎంపీడీవో షాజీలోద్దీన్, తహసీల్దారు రజని, ఏవో రాజ్‌నారాయణలు వారికి స్వాగతం పలికారు.

యువ పర్యాటకం.. అభివృద్ధికి దోహదం




యువతకు దేశ, రాష్ట్ర భౌగోళిక విశిష్టతలు, విభిన్న సంస్కృతులపై అవగాహన పెంచడమే లక్ష్యంగా ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం.. పర్యాటక శాఖతో కలిసి యువ పర్యాటక క్లబ్‌ల ఏర్పాటుకు సంకల్పించింది. దేశంలోని చారిత్రక, పర్యాటక ప్రాంతాల అభివృద్ధిలో యువతను భాగస్వాములను చేయాలన్న ఉద్దేశంతో ఈ దిశగా అడుగేసింది. వీటిల్లో చేరే వారికి సాంస్కృతిక రాయబారులుగా తీర్చిదిద్దేలా కార్యాచరణ రూపొందించడం విశేషం.

న్యూస్‌టుడే, మెదక్ టౌన్, సిద్దిపేట, సంగారెడ్డి టౌన్

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో సందర్శనీయ ప్రాంతాలెన్నో ఉన్నాయి. సిద్దిపేట కోమటిచెరువు, వికారాబాద్‌లోని అనంతగిరి అటవీ ప్రాంతం, మెదక్‌లో ఏడుపాయల ఆలయం, నర్సాపూర్ అటవీ ప్రాంతం, సంగారెడ్డిలో మంజీరా తదితర ప్రాంతాల సందర్శనకు నిత్యం వేలాది మంది వస్తుంటారు. వీటితో పాటు రాష్ట్రంలోని వివిధ పర్యాటక స్థలాలు, అక్కడి చారిత్రక వైభవం అధ్యయనం చేయడంతో పాటు అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యేలా క్లబ్ సభ్యులు దోహదపడుతారు. మరోవైపు సందర్శకులకు అవగాహన కల్పించే బాధ్యత వీరిపై ఉంటుంది. నాలుగు

నాలుగు జిల్లాల్లో క్లబ్‌లు ఏర్పాటు

జిల్లా	విద్యాలయాలు	సభ్యులు
మెదక్	189	3830
సిద్దిపేట	112	2240
సంగారెడ్డి	250	2500
వికారాబాద్	130	2600





మెదక్ చర్చి వద్ద విద్యార్థులు

జిల్లాల్లో క్లబ్‌ల ఏర్పాటు ముమ్మరంగా సాగుతోంది.

అన్ని విద్యాసంస్థల్లో..

ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో యువ పర్యాటక క్లబ్‌లు ఏర్పాటుచేయనున్నారు. క్లబ్‌కు పాఠశాల ప్రిన్సిపల్ అధ్యక్షుడిగా, ఉపాధ్యాయుడు/అధ్యాపకుడు సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. పాఠశాలల్లో 7-9 తరగతులకు చెందిన విద్యార్థులు, కళాశాలల్లో ఆయా గ్రూప్‌లకు సంబంధించిన విద్యార్థులు 20 మంది వరకు సభ్యులుగా ఉంటారు. ప్రతి నెలా ఒకసారి సమావేశమై సభ్యులకు పర్యాటక అంశాలపై దిశానిర్దేశం చేస్తారు. ఆ నెలకు సంబంధించి ప్రణాళిక రూపొందించుకుంటారు. క్లబ్‌ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిమిత్తం జిల్లాల డీఆర్డీవోలకు ప్రత్యేకంగా లింకు పంపించారు.

నిర్వహించే కార్యక్రమాలు

● పట్టణాలు, గ్రామాలకు సమీపంలో ఉన్న పర్యాటక కేంద్రాల వరకు ట్రెక్కింగ్, సైకిల్ ర్యాలీలు నిర్వహిస్తారు. ● వ్యాస రచన, క్విజ్, లోగో డిజైనింగ్, చిత్రలేఖనం, పోస్టర్ డిజైనింగ్ వంటి అంశాల్లో పోటీలు. ● పర్యాటకం ప్రాధాన్యంపై ఉపన్యాస పోటీలు. ● సందర్శనీయ ప్రాంతాల్లో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించడం. ● చారిత్రక, వారసత్వ ప్రాంతాల ప్రాముఖ్యతపై ప్రచారం చేయడం.



ప్రయోజనాలు ఇలా..

● వివిధ ప్రాంతాల్లో పర్యటించి అక్కడి వారసత్వ కట్టడాలు, పర్యాటక ప్రాంతాలపై అధ్యయనం చేయవచ్చు.

● అక్కడి ప్రజల జీవన స్థితిగతులు తెలుసుకోవచ్చు.

● యాత్రలు, అనుభూతులను కథలు, షార్ట్‌ఫిల్మ్‌గా మలిచే అవకాశం ఉంటుంది. పోటీ పరీక్షలకు ఉపయోగపడతాయి.

● పర్యాటకుల గైడ్‌గా పని చేసి ఉపాధి పొందే అవకాశం ఉంటుంది.


ఇదో సదవకాశం



యువ పర్యాటక క్లబ్‌ల ద్వారా పర్యాటక రంగంపై అవగాహన పెరుగుతుంది. ఈ రంగంలో స్థిరపడేందుకు ఇదో సదవకాశం. పర్యాటక ప్రదేశాలపై అధ్యయనం చేయడం వల్ల భవిష్యత్తులో పలు రకాలుగా ఉపయోగపడుతుంది.

– వెంకటేశ్వర్లు, నోడల్ అధికారి, మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

పరిశోధన ఫలాలు రైతులకు అందేలా చేస్తాం: వీసీ రాజిరెడ్డి



ములుగు: ఉద్యాన పంటలు, నూతన వంగడాలపై చేసిన పరిశోధనల ఫలితంగా వచ్చిన ఫలాలను రైతులకు అందేలా చేస్తామని సిద్దిపేట జిల్లా ములుగులోని కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉప కులపతి (వీసీ) దండా రాజిరెడ్డి అన్నారు. కొత్త వీసీగా సోమవారం ములుగు ఉద్యాన విశ్వవిద్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 11 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలను రైతులు సాగు చేస్తున్నారన్నారు. విద్యార్థులకు పరిశోధనలతో కూడిన విద్యను అందించేందుకు మరింత కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ వీసీ నీరజ ప్రభాకర్, రిజిస్ట్రార్ భగవాన్, డీన్‌లు రాజశేఖర్, విజయ, నటరాజన్ శ్రీనివాసన్, లక్ష్మీ నారాయణ, నాగేశ్వర్‌రావు, ఆచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

సిద్దిపేట అర్బన్: ఎస్‌జీఎఫ్ ఖోఖో అండర్-14 విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు సిద్దిపేట గ్రామీణ మండలం రాఘవాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు హరీశ్, శివప్రసాద్, రంజిత్ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుభార్గవి తెలిపారు. ఈ నెల 20న ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి విభాగంలో ముగ్గురు విద్యార్థులు ఖోఖో పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు.



చికెన్ ధరలు			
ఫాంరేటు	125–00	డ్రెస్డ్	213–00
రిటైల్	147–00	స్కిన్‌లెస్	243–00

రైతును బలి తీసుకున్న రక్షణ తీగ



కిషన్

వెల్దుర్తి: అడవి పందుల నుంచి పంటను రక్షించుకునేందుకు పొలం చుట్టూ ఏర్పాటుచేసిన ఇనుప కంచెకు విద్యుత్తు కనెక్షన్ ఇవ్వగా.. అదే ఆ రైతు ప్రాణాన్ని బలి తీసుకుంది. ఈ విషాదకర ఘటన మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం యశ్వంతరావుపేటలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ రాజు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రాచపల్లి కిషన్ (55), స్వరూప దంపతులకు కుమారుడు వంశీ ఉన్నాడు. వ్యవసాయమే జీవనాధారం. పొలంలోకి అడవి పందులు దూరకుండా ఉండేందుకు చుట్టూ కంచె బిగించి దానికి విద్యుత్తు కనెక్షన్ ఇచ్చాడు. రోజుమాదిరిగానే ఆదివారం రాత్రి కంచెకు కరెంట్ కనెక్షన్ ఇవ్వగా, సోమవారం ఉదయం దాన్ని తొలగించేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్తు తీగ తగిలి కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మధ్యాహ్నమైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు అక్కడికి వెళ్లి చూడగా విగతజీవిగా కనిపించాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

రెండు రోజుల్లో ఇద్దరు.. ఈ నెల 19న ఇదే గ్రామానికి చెందిన గుండెని యాదయ్య పొలం చుట్టూ ఏర్పాటుచేసిన విద్యుత్తు తీగకు తగిలి మృతి చెందిన విషయం విదితమే. అది మరువక ముందే ఈ ఘటన జరగడం గ్రామంలో విషాదాన్ని నింపింది.

విద్యుదాఘాతంతో యువరైతు...



దుర్గేశ్

హత్నూర, న్యూస్‌టుడే: అహర్నిశలు శ్రమించి పైరును కంటికి రెప్పలా కాపాడుకున్నాడు. ఆ చేనును కోసేందుకు వెళ్లి విద్యుదాఘాతానికి గురై మృత్యువాతపడ్డారు. ఈ ఘటన హత్నూర మండలం నాగుల్‌దేవుల్‌పల్లిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై సుభాష్ తెలిపిన వివరాలు.. నాగుల్‌దేవుల్‌పల్లికి చెందిన పడాల దుర్గేశ్(34) సన్నకారు రైతు. వానాకాలంలో తన పొలంలో వరి వేయగా కోతకొచ్చింది. తండ్రి మల్లయ్యతో కలిసి పొలానికి వెళ్లాడు. యంత్రంతో వరి కోస్తున్న క్రమంలో.. ఆ యంత్రానికి విద్యుత్తు తీగ తగిలి దుర్గేశ్‌పై పడటంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే కుమారుడిని.. తండ్రి స్థానికుల సహాయంతో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దుర్గేశ్‌కు భార్య లత, నాలుగేళ్ల కూతురు ఉంది. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులోని మోటారు తీయబోయి రైతు మృతి




చంద్రం

దౌల్తాబాద్: చెరువులో ఉన్న మోటారును పైకి తీయబోయి ప్రమాదవశాత్తు నీటిలో పడి రైతు మృతి చెందిన ఘటన సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం ఉప్పరపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ ప్రేమ్‌దీప్ తెలిపిన వివరాలు.. ఉప్పరపల్లికి చెందిన చంద్రం(49) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వరి పొలానికి నీరు పెట్టుకోవడానికి మోటారును చెరువులో వేశాడు. వరికి నీటి అవసరం తగ్గిపోవడంతో మోటారును పైకి తీయడానికి యత్నిస్తుండగా కాలుజారి చెరువులో పడిపోయి ప్రాణాలు కోల్పోయాడు. పొరుగు పొలం రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. భార్య నిర్మల ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

మాచిన్‌పల్లిలో గుర్తుతెలియని మృతదేహం

దౌల్తాబాద్: సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం మాచిన్‌పల్లిలోని ఊట చెరువులో సోమవారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాలు.. మాచిన్‌పల్లి అటవీ ప్రాంతంలోని ఊటచెరువులో మేకలకు నీరు తాపడానికి కాపరులు వెళ్లగా మృతదేహం నీళ్లలో తేలి ఉండటాన్ని గమనించారు. వెంటనే గ్రామస్థులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి విచారించినా ఎవరన్నది తెలియలేదన్నారు.

పాత కక్షలతో యువకుడి హత్య



అనిల్‌రాజు

సదాశివపేట, న్యూస్‌టుడే: పాత కక్షలతో యువకుడిని దారుణంగా హత్య చేసిన ఘటన సదాశివపేట పట్టణంలో చోటుచేసుకొంది. సీఐ తెలిపిన వివరాలు.. మ్యాతరి అనిల్ రాజు(29) సిద్దాపూర్ ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్నాడు. మరుగుదొడ్లు, సెప్టిక్ ట్యాంకులు శుభ్రం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి కాలనీకి చెందిన మరో ఇద్దరితో కలసి మద్యం తాగడానికి వెళ్లి తిరిగిరాలేదు. సోమవారం ఉదయం స్థానిక ప్రభుత్వ నర్సరీలో యువకుడి మృతదేహం రక్తపు మడుగులో ఉందని సమాచారం అందడంతో పోలీసులు ఘటనా స్థలికి వెళ్లి పరిశీలించారు. గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేశారు. అనిల్ రాజు తల్లి ధనలక్ష్మి కాలనీలోని ముగ్గురిపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆ ముగ్గురితో తమ కుటుంబానికి విభేదాలు ఉన్నాయని, పాత కక్షలతో హత్య చేసి ఉంటారని పేర్కొన్నారు. పోలీసులు క్లూస్‌టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. హత్యచేసిన వారిని త్వరలోనే పట్టుకుంటామని సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య



లింగంచారి

పాపన్నపేట: ఆర్థిక ఇబ్బందులతో ఒకరు ఆత్మహత్య చేసుకున్నాడు. మెదక్ జిల్లా పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాలు.. మండలంలోని పాత లింగాయిపల్లికి చెందిన కమ్మరి లింగంచారి (36), అనిత దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. లింగంచారి 8 ఏళ్లుగా కుటుంబంతో సహా హైదరాబాద్‌లో ఉంటూ మేస్త్రీగా పని చేస్తున్నాడు. దసరాకు అందరూ స్వగ్రామానికి వచ్చారు. కొన్ని నెలలుగా ఉపాధి సరిగా లేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ఈ విషయమై భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గదిలో దూలానికి ఉరేసుకున్నాడు. స్థానికులు గమనించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. మృతుడి సోదరుడు సుధాకర్ ఫిర్యాదుతో కేసు నమోదైంది.

మనోవేదనతో మరొకరు..



రమేశ్

నిజాంపేట (రామాయంపేట): ఆర్థికంగా సతమతమవుతున్న ఒకరు మనోవేదనతో ఆత్మహత్య చేసుకున్నాడు. మెదక్ జిల్లా నిజాంపేట ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మండలంలోని నార్లాపూర్‌కు చెందిన బోయిని రమేశ్ (32), భాగ్యలక్ష్మి దంపతులకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వచ్చే కూలి డబ్బులతో కుటుంబ పోషణ భారంగా మారడంతో మనస్తాపం చెందాడు. ఆదివారం అర్ధరాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి సమీపంలోని కల్వకుంట శివారులో చెట్టుకు ఉరేసుకున్నాడు. సోమవారం ఉదయం గమనించారు. భాగ్యలక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదైంది.

ట్రాక్టర్ ఢీకొని రైతు దుర్మరణం



బాలకిష్టయ్య

దుబ్బాక: అతి వేగంతో, అజాగ్రత్తగా ట్రాక్టర్ డ్రైవర్.. వెనుక నుంచి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో రైతు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. సిద్దిపేట జిల్లా దుబ్బాక ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాలు.. దుబ్బాక మండలం బల్వంతాపూర్‌కు చెందిన జంగిటి బాలకిష్టయ్య (65), లక్ష్మి దంపతులకు నలుగురు సంతానం. వ్యవసాయమే జీవనాధారం. ఆదివారం మధ్యాహ్నం బాలకిష్టయ్య ఇంటి నుంచి ద్విచక్రవాహనంపై బల్వంతాపూర్ గ్రామానికి ఓ పని నిమిత్తం బయల్దేరాడు. మార్గమధ్యలో ట్రాక్టర్ డ్రైవర్ అతివేగంగా వచ్చి బాలకిష్టయ్య బైక్‌ను ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన అతడికి సిద్దిపేట జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. సోమవారం కేసు నమోదు చేశారు.

బైక్ అదుపు తప్పి వాహనదారుడు..

బెజ్జంకి: రాజీవ్ రహదారిపై ద్విచక్రవాహనం అదుపు తప్పి రెయిలింగ్‌ను ఢీ కొట్టడంతో యువకుడు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం తోటపల్లి శివారులో చోటుచేసుకుంది. ఎస్సై కృష్ణారెడ్డి తెలిపిన వివరాలు.. గోదావరిఖనికి చెందిన బోనగిరి మనోజ్(25), కొత్తగూడెంకు చెందిన జోన్ అన్విత్ ఇద్దరు మిత్రులు. కరీంనగర్‌లో అద్దె గదిలో ఉంటూ ప్రైవేటు కంపెనీల్లో పని చేస్తున్నారు. పని నిమిత్తం కరీంనగర్ నుంచి ద్విచక్ర వాహనంపై సిద్దిపేట వైపు బయల్దేరారు. తోటపల్లి వద్ద ప్రమాదం జరిగింది. 108 వాహనంలో ఇద్దరిని కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మనోజ్ మృతి చెందాడు. అన్విత్ చికిత్స పొందుతున్నాడు. ఫిర్యాదు రాగానే కేసు నమోదుచేస్తామని ఎస్సై తెలిపారు.

సీఎం సహాయ నిధితో పేదలకు భరోసా

పరిగి గ్రామీణ, న్యూస్‌టుడే: సీఎం సహాయనిధితో బడుగు వర్గాల ప్రజలకు భరోసా లభిస్తోందని డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. అనారోగ్య పరిస్థితుల్లో చికిత్స పొందిన మండల పరిధిలోని చిట్యాలకు చెందిన శివకుమార్‌కు సోమవారం రూ.39వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందించారు. కార్యక్రమంలో డీసీసీ నాయకులు రాజపుల్లారెడ్డి పాల్గొన్నారు.

ఎన్కేపల్లి గ్రామాభివృద్ధికి తోడ్పడండి



ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని కలిసిన ఎన్కేపల్లి కాంగ్రెస్ నాయకులు.

యాలాల, న్యూస్‌టుడే: ఎన్కేపల్లి గ్రామాభివృద్ధికి తోడ్పడాలని ఎన్కేపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు గొల్ల కిష్టప్ప, మల్గ లక్ష్మప్ప ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిని కోరారు. సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో గ్రామస్థులతో కలిసి సమస్యలు వివరించారు. కిష్టప్ప మాట్లాడుతూ.. ప్రతి వర్షాకాలంలో జుంటిపల్లి ఎడమ కాలువ వాగు దాటాలంటే పీకల్లోతు నీటిలో సాహసం చేయాల్సి వస్తోందని, వెంటనే రైతులకు ఇబ్బందులు కలగకుండా వంతెన నిర్మించాలన్నారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారన్నారు. కాంగ్రెస్ నాయకులు మల్గ లక్ష్మప్ప, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలను బలోపేతం చేస్తాం



ఆర్.కృష్ణయ్యతో తాండూరు నాయకులు

తాండూరు: జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో బీసీలను బలోపేతం చేయడానికి గ్రామస్థాయి నుంచి పట్టణాల వరకు సమావేశాలు నిర్వహిస్తామని జాతీయ బీసీ సంఘం కార్యవర్గ సభ్యుడు, తాండూరు నియోజకవర్గ కన్వీనర్ కందుకూరి రాజ్‌కుమార్ తెలిపారు. హైదరాబాద్‌లో సోమవారం ఆయన తాండూరుకు చెందిన రాష్ట్ర, జిల్లా స్థాయి బీసీ నాయకులతో వెళ్లి జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. త్వరలో బీసీ రాజకీయ పార్టీని స్థాపించడానికి కృషి చేస్తామని ఆర్. కృష్ణయ్య తమతో చెప్పారన్నారు. రాష్ట్ర బీసీ నాయకుడు సయ్యద్ షకూర్, జిల్లా నాయకులు వెంకటేష్, రామకృష్ణ, నిఖిల్ ఉన్నారు.

రూ.20 లక్షలతో ఆరోగ్య ఉపకేంద్ర నిర్మాణం

దౌల్తాబాద్: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వెంకట్‌రావు అన్నారు. సోమవారం ఆయన మండలంలోని దేవర్‌ఫస్లావాద్ గ్రామంలో రూ.20లక్షలతో ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో ఆరోగ్య ఉపకేంద్రాలు ఉంటే ప్రజలు ప్రాథమిక వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. పార్టీ నాయకులు వెంకట్‌రాములు, మాజీ సర్పంచులు మంజులాల్, పాండు కార్యకర్తలు తదితరులున్నారు.

అనుమతుల్లేని పాఠశాలలపై చర్యలు తీసుకోండి

తాండూరు టౌన్, న్యూస్‌టుడే: పట్టణంలోని అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని యూఎస్‌ఎఫ్‌ఐ నాయకుడు దీపక్‌రెడ్డి సోమవారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. పట్టణంలో ప్రభుత్వ అనుమతుల్లేకుండా బడులు నడుపుతున్నారని ఆయన ఫిర్యాదులో తెలిపారు. అధికారులు పట్టించుకోవాలన్నారు.

భవన నిర్మాణాలకు కాసుల కొరత

అసంపూర్తిగా పనులతో తీరని సమస్యలు

న్యూస్‌టుడే- పరిగి గ్రామీణ, దోమ



పరిగి జడ్పీహెచ్‌ఎస్-Iలో స్తంభాలకే పరిమితమైన భోజనశాల నిర్మాణం

సామాజిక అవసరాలు తీర్చాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాల ద్వారా భవనాలు నిర్మించేందుకు రూ.లక్షలు మంజూరు చేస్తున్నా విడుదలలో జాప్యమవుతోంది. నిర్మాణ సామగ్రి ధరలు భారీగా పెరుగుతుండడంతో పనులు ముందుకు సాగడం లేదు. నిధుల కొరతతో నిర్వాహకులు గడువులోగా పనులు పూర్తి చేయడం లేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. అధికారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్లుగా పరిస్థితులు మారకపోవడంతో నిర్వహణ కొరవడి నిరుపయోగంగా మారుతున్నాయి. పనుల మంజూరులో చూపుతున్న ఆసక్తి పూర్తి చేయడంలో కనిపించడం లేదు. ఇప్పటికైనా నిధులు విడుదల చేసి భవనాలను అందుబాటులోకి తెచ్చేలా చూడాలని కోరుతున్నారు.

ఏళ్లుగా ఇదే పరిస్థితి..

పరిగి మండల పరిధిలోని రాఘవాపూర్‌లో 8 ఏళ్ల కిందట వెనుకబడిన తరగతుల వారి కోసం కమ్యూనిటీ భవనం ప్రారంభించారు. ప్రభుత్వం మంజూరు చేసిన రూ.3 లక్షల నిధులు సరిపోక స్లాబ్ స్థాయి వరకే ఆగిపోయింది. ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం నిధులు విదల్చక పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. పరిగి పట్టణంలోని జడ్పీహెచ్‌ఎస్-1 విద్యార్థుల భోజన గది నిర్మాణ పనులు నిధుల కొరతతో స్తంభాలకే పరిమితమయ్యాయి. జడ్పీహెచ్‌ఎస్-2 పాఠశాలలో భోజన గది నిర్మాణ పనులు స్లాబ్ దశలోనే ఆగిపోయాయి. దోమలోని దివ్యాంగుల భవనం పదేళ్ల కిందట రూ.8 లక్షలతో ప్రారంభించారు. కిటికీలు, ఫ్లోరింగ్ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. సమావేశాలు చెట్ల కింద నిర్వహించుకొంటున్నామని దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవనం పూర్తి చేస్తే సమస్య తీరుతుందని అంటున్నారు. దిర్సంపల్లి ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం పిల్లర్ల స్థాయిలో నిలిచింది. ఊట్‌పల్లిలో పదేళ్ల కిందట ప్రారంభించిన డ్వాక్రా మహిళా సంఘాల భవనం అసంపూర్తిగానే ఉంది. పాలెపల్లిలో డ్వాక్రా భవనం ఫ్లోరింగ్, ప్లాస్టింగ్ పనులు పూర్తికానందున సమావేశాలను జీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసుకుంటున్నారు. తిమ్మాయిపల్లిలో అంగన్‌వాడీ భవనం నిర్మించినా వినియోగంలోకి రాలేదు. మోత్కూరులో గ్రామీణ ప్రజలకు వైద్య సేవలందించాలని ప్రారంభించిన ఆరోగ్య ఉపకేంద్రం (సబ్ సెంటర్) భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి.

నిధులకు ప్రతిపాదనలు పంపిస్తాం..

– ఎంఏ కరీం, ఎంపీడీవో- గోపాల్, ఎంఈవో, పరిగి

అసంపూర్తిగా ఉన్న భవనాలను పూర్తి చేసేందుకు అవసరమైన నిధుల కోసం అంచనాలు వేయించి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తాం. చిన్న చిన్న పనులు మిగిలి ఉంటే నిర్వాహకులతో పూర్తి చేయించి వినియోగంలోకి వచ్చేలా చూస్తాం.

మేమున్నాం.. మీకు తోడుగా

వికారాబాద్‌టౌన్: 80742 74587
తాండూరు టౌన్: 80085 73260
పరిగి : 80085 73272
కొడంగల్: 94403 34770
(10 AM TO 1 PM)

న్యూస్‌టుడే, కుల్కచర్ల, పరిగి, కుల్కచర్ల గ్రామీణ

? మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో శౌచాలయాలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. **– రాజు, ఇప్పాయిపల్లి**

✓ గతంలోనే స్థలం పరిశీలించారు. దృష్టి సారించి శౌచాలయాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటాం.
– మురళీధర్, ప్రత్యేకాధికారి, కుల్కచర్ల

? మండలంలోని రావులపల్లిలో తరచూ ఎద్దడి సమస్య వస్తోంది. భగీరథ నీరు రాని రోజు చాలా ఇబ్బందులు పడుతున్నాం. ప్రత్యామ్నాయంగా బోరు వేసి అవస్థలు తీర్చాలి.**– రమేష్‌కుమార్, రావులపల్లి**

✓ సాంకేతిక సమస్యలు తలెత్తినప్పుడే సరఫరాకు అవరోధం కలుగుతోంది. ప్రజలకు ముందస్తుగా తెలుపుతున్నాం. సమస్య పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటాం.
– సుబ్రహ్మణ్యం, డీఈఈ, గ్రామీణ నీటి సరఫరా విభాగం

? కుల్కచర్ల ప్యాటగడ్డ కాలనీలో మురుగు కాలువల సమస్య ఉంది. పూర్తి స్థాయిలో మురుగు కాలువలు నిర్మించకపోవడంతో రోడ్డు పక్కనుంచే మురుగు పారుతోంది. **– మహిపాల్, స్థానికుడు**

✓ మురుగు కాలువల సమస్య మా దృష్టికి వచ్చింది. రోడ్డు పనుల కారణంగా పనులు నిలిచిపోయాయి. సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తాం. **– రామకృష్ణ నాయక్, ఎంపీడీవో**

పాఠశాలల అభివృద్ధికి సహకరించండి



ఎంఈవోను సన్మానిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

పూడూరు: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థల సహకారం ఎంతో అవసరమని ఎంఈవో సాయిరెడ్డి కోరారు. శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఎంఈవోను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. . ఫౌండేషన్ ద్వారా ఏటా అందిస్తున్న ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యాచరణ పుస్తకాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. ఫౌండేషన్ సభ్యులు ఉప్పు నవీన్‌కుమార్, రాకేశ్, డబ్బు అఖిల, సీఆర్పీలు గాలయ్య, రమాదేవి ఉన్నారు.

ఎన్ఎంఎంఎస్ విద్యా సామగ్రి అందజేత



చిల్ముల్ మైలారం పాఠశాలలో పుస్తకాలు అందిస్తున్న ఉపాధ్యాయులు

దుద్యాల: మండలంలోని చిల్ముల్ మైలారం పాఠశాలలో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులకు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) విద్యా సామగ్రిని (స్టడీ మెటీరియల్) సోమవారం అందించారు. యూత్ ఫర్ సేవ సహకారంతో అందించిన ఈ మెటీరియల్ పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో విజయరామారావు, ఉపాధ్యాయులు రవీందర్‌గౌడ్, రాములు పాల్గొన్నారు.

మంచి పనికి విమర్శలు సరికాదు

తాండూరుగ్రామీణ, న్యూస్‌టుడే: గౌడ కుటుంబాలకు రూ.2వేల చొప్పున ఇప్పించి మేలు చేసిన తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిని విమర్శించడం సరికాదని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సహకార సంఘాల ఉపాధ్యక్షులు రవీందర్‌గౌడ్ అన్నారు. తాండూరు మండలంలోని కాంగ్రెస్ నాయకులతో కలిసి సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విపణి డైరెక్టర్ జర్నప్ప, ముఖ్యనాయకులు శ్రీనివాస్‌గౌడ్, హరీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

మరుగుదొడ్ల బిల్లులు చెల్లించండి



ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం ఇస్తున్న మాజీ వైస్ ఎంపీపీ

బొంరాస్‌పేట, న్యూస్‌టుడే: సంపూర్ణ పారిశుద్ధ్యంలో భాగంగా స్వచ్ఛ భారత్ మిషన్ పథకం ద్వారా రెండేళ్ల కిందట మండలంలోని చౌదర్‌పల్లిలో నిర్మించిన 70 మరుగుదొడ్లకు బిల్లులు చెల్లించాలని మాజీ వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం అందించారు. లబ్ధిదారులు సొంత ఖర్చులతో మరుగుదొడ్లు నిర్మించుకున్నారని, బిల్లులు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన తెలిపారు. అధికారులు స్పందించి బిల్లులు ఇప్పించాలని కోరారు.

లీకేజీలు, మరమ్మతులపై అవగాహన

పెద్దేముల్, న్యూస్‌టుడే: తరచూ ఏర్పడే లీకేజీల మరమ్మతులపై పంచాయతీ తాగునీటి సహాయకులకు సోమవారం శిక్షణ ఇచ్చారు. శిక్షకుడు రాములు మరమ్మతుల్లో పాటించాల్సిన నిబంధనలను వివరించారు. పైపులను కలపడం, కొత్త కనెక్షన్లు, బోరు మోటారు మరమ్మతులు వంటి విషయాలపై ప్రయోగపూర్వకంగా శిక్షణ అందించారు. కార్యక్రమంలో అఖిల్, ప్రతిభ తదితరులు పాల్గొన్నారు.

తారు లేచి.. కంకర తేలి..



బోట్యానాయక్ తండా నుంచి ముజాహిద్‌పూర్‌కు వెళ్లే దారిలో తారు రోడ్డంతా గుంతలమయంగా మారింది. తారు లేచి కంకర తేలి గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. రాత్రివేళ నానా అవస్థలు పడుతున్నారు. అధికారులు దృష్టి సారించి గుంతల్లో మట్టి పోయించాలని వాహన చోదకులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కుల్కచర్ల గ్రామీణ

మురుగు కాలువలు కరవాయె



మండల కేంద్రంలో చాలా చోట్ల మురుగు కాలువలు లేకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రెండేళ్ల కిందట ప్రధాన చౌరస్తా నుంచి చిన్న గేటు వరకు రహదారి విస్తరించారు. ఒక వైపు మాత్రమే కాలువ నిర్మించారు. మరోవైపు లేకపోవడంతో ఇళ్లలో నుంచి వచ్చే మురుగు రహదారిపై పారుతోంది. దీంతో రాత్రివేళ దోమల సమస్య పెరిగిందని వాపోతున్నారు. – న్యూస్‌టుడే, కుల్కచర్ల

పదేళ్లుగా నిరుపయోగం



మండలంలోని దుప్చర్లలో పదేళ్ల కిందట నిర్మించిన పాఠశాల అదనపు తరగతి గది నిరుపయోగంగా మారింది. విద్యార్థులకు గదులు సరిపోవడం లేదని అప్పటి ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేసింది. పాఠశాలకు దూరంగా గుట్టపై గది నిర్మించారు. నిర్మాణం పూర్తయినా బిల్లులు రాకపోవడంతో గుత్తేదారు చిన్నచిన్న పనులు చేయలేదు. దీంతో భవనం అప్పట్నుంచి నిరుపయోగంగా ఉంది. – న్యూస్‌టుడే, బొంరాస్‌పేట



విజయభాస్కర్‌రెడ్డికి నివాళి అర్పించిన డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి, ఎస్సై సంతోష్

పోలీసు అమరవీరుడికి నివాళి

పరిగి గ్రామీణ, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి సుల్తాన్‌పూర్‌లోని అమర జవాను విజయభాస్కర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎస్సై సంతోష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి తిరుమలనాథ ఉత్సవాలు



పూడూరు, న్యూస్‌టుడే: మండల పరిధి పెద్ద ఉమ్మెంతాల్‌లో వెలిసిన శ్రీ తిరుమలనాథ స్వామి ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయని నిర్వాహకులు తెలిపారు. 22న మధ్యాహ్నం ధ్వజారోహణం, పుణ్యాహవాచనం, రాత్రికి ఎదుర్కోళ్లు, 23న సామూహిక గీతాయజ్ఞం, 24న తెల్లవారుజామున రథోత్సవం, రాత్రికి పూలవసంతోత్సవం, 25న మానసపూజ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఆలయ పీఠాధిపతి శ్రీవెంకటదాసు మార్గదర్శకత్వంలో కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

ఫ్రిడ్జి పేలి ఇల్లు దగ్ధం



కుల్కచర్ల, న్యూస్‌టుడే: రిఫ్రిజిరేటర్‌లోని కంప్రెసర్ పేలి ఇంట్లో మంటలు చెలరేగాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. చౌడాపూర్ మండలం చాకల్‌పల్లికి చెందిన చెన్నయ్య గతనెల రిఫ్రిజిరేటర్ కొన్నాడు. సోమవారం సాయంత్రం ఒక్కసారిగా రిఫ్రిజిరేటర్ కంప్రెషర్ పేలింది. మంటలు వ్యాపించి ఇంట్లోని నిత్యావసరాలు, దస్తులు కాలిపోయాయి. అప్రమత్తమైన గ్రామస్థులు నీరు తెచ్చి మంటలార్పారు. అప్పటికే వస్తువులన్నీ కాలిపోయాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పిందని స్థానికులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో హోమాలు



హోమంలో పాల్గొన్న భక్తులు

కొత్లాపూర్(తాండూరు గ్రామీణ), న్యూస్‌టుడే: మండల పరిధి కొత్లాపూర్‌లోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో చండీ, మృత్యుంజయ హోమాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ సంఘం అధ్యక్షుడు నవీన్‌రెడ్డి సతీసమేతంగా పాల్గొన్నారు. ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ఆధునికీకరణ పనులకు ఆటంకం కలగకుండా చూడాలంటూ అమ్మవారిని వేడుకున్నారు. అర్చకులు శ్రీనివాస్, అఖిల్‌భట్ తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

పూడూరు: ఏకాదశి సందర్భంగా మండల కేంద్రంలోని సోమలింగేశ్వర ఆలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడు, భాజపా నాయకుడు మల్లేశ్ పటేల్ స్వామివారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో స్థానికులు రాజు, గోపాల్, నర్సింలు ఉన్నారు.

ఘనంగా మల్లికార్జున స్వామి ఆలయ వార్షికోత్సవం



అలంకరణలో దేవతల విగ్రహాలు

దుద్యాల, న్యూస్‌టుడే: మండలంలోని హకీంపేటలో మల్లికార్జున స్వామి దేవాలయ నాలుగో వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయం నుంచి స్వామివారి విగ్రహాలతో పెద్దబండ దగ్గరున్న మల్లికార్జున స్వామి దేవాలయం వరకు ఉత్సవమూర్తులను భాజాభజంత్రీల మధ్య ఊరేగింపు నిర్వహించారు. రుద్రహోమం, అభిషేకం, ప్రత్యేక పూజలతోపాటు గ్రామస్థుల సమక్షంలో స్వామి వారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు.

ఐటీఐలో మిగులు సీట్లు భర్తీ

వికారాబాద్ మున్సిపాలిటీ: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో ఏడో విడతలో మిగిలిపోయిన సీట్లను భర్తీ చేస్తున్నామని ప్రిన్సిపల్ ఆర్. నరేంద్రబాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈనెల 30 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రతిభ ఆధారంగా సీట్లను కేటాయిస్తామన్నారు. ఇతర వివరాలకు ఫోన్ నం.9177472488లో సంప్రదించాలన్నారు.

జీవో 29తో నిరుద్యోగులకు అన్యాయం

తాండూరు, న్యూస్‌టుడే: జీవో 29 అమలుతో బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ రాజుగౌడ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జీవో రద్దుకు నిరుద్యోగుల నుంచి తిరుగుబాటు తప్పదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ నిరుద్యోగులపై గౌరవముంటే జీవోను రద్దు చేయాలన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

యాలాల, న్యూస్‌టుడే: ప్రభుత్వ అనుమతుల్లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు కేసు నమోదు చేస్తామని ఎస్సై శంకర్ అన్నారు. సోమవారం రాత్రి కోకట్ సమీపంలోని కాగ్నా నది నుంచి ఎలాంటి అనుమతుల్లేకుండా ఆటోలో ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో తనిఖీలు చేశామన్నారు. ఆటోను రాణాకు తరలించి కేసు పెట్టినట్లు తెలిపారు. మండలంలో ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

దాడులు చేస్తున్న దుండగులను కఠినంగా శిక్షించాలి



అధికారులకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

తాండూరు టౌన్: హిందూ దేవాలయాలపై దాడులు చేస్తున్న వాళ్లను కఠినంగా శిక్షించాలని హిందూ పరిరక్షణ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తాండూరు సబ్ కలెక్టరు కార్యాలయంలో సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. వరుసగా హిందు దేవాలయాలను లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడుతున్న నిందితులను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలన్నారు. విశ్వ హిందూ పరిషత్, తెలంగాణ సాధు పరిషత్, హిందూ వాహిని, భాజపా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జల భాండాగారం.. కూలితే ప్రమాదం



మండల పరిధి తిమ్మాయిపల్లిలో జలభాండాగారం శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉంది. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఒకవైపు ఇనుప చువ్వలు తేలాయి. ప్రమాదం జరగకముందే దాన్ని తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, యాలాల

పట్టణ అభివృద్ధే లక్ష్యం

వికారాబాద్ మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: వికారాబాద్ పట్టణ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని పుర అధ్యక్షురాలు మంజుల అన్నారు. సోమవారం ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డితో కలిసి పట్టణ పరిధి వార్డుల్లో సీసీ రోడ్లు, ట్రాన్స్‌ఫార్మర్, యూజీడీ పైప్‌లైన్ పనులకు కొబ్బరి కాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.33 లక్షలు ఎమ్మెల్యే నిధులు, అలాగే 15వ ఆర్థిక సంఘం నిధులతో ఈ పనులను చేపడుతున్నామని తెలిపారు. మాజీ ఉపాధ్యక్షుడు రమేశ్‌కుమార్, కౌన్సిలర్లు మురళి, దేవి, నాయకులు రెడ్యానాయక్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

23న ఆలయ కార్యవర్గ సమావేశం

తాండూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయ కార్యవర్గ సమావేశాన్ని ఈనెల 23న నిర్వహించనున్నట్లు ఆలయ సంఘం ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి తెలిపారు. ఆలయ ఆదాయ, వ్యయాలు, త్వరలో నిర్వహించే సర్వసభ్య సమావేశానికి సంబంధించిన అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్లు ఆయన తెలిపారు.

పల్లెలకు అనారోగ్యం

- వైద్య సేవలు అంతంత మాత్రమే
- అవస్థలు పడుతున్న రోగులు



చన్‌గోముల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

పూడూరు, న్యూస్‌టుడే: ఇటీవల వచ్చిన తుఫాను, వాతావరణంలో మార్పులతో పల్లె ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు. ఇంటికి ఇద్దరు, ముగ్గురు జ్వరాలు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. వ్యాధుల సీజన్ కావడంతో ఆరోగ్య కేంద్రాలకు రోగుల తాకిడి పెరిగింది. చాలా మందికి టైఫాయిడ్, డెంగీ, మలేరియా వంటివి సోకుతుండటంతో ఆసుపత్రులకు తరలుతున్నారు. ప్రభుత్వపరంగా పల్లె దవాఖానాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వాటి పరిధిలోని ఉప కేంద్రాలున్నా సర్కారు వైద్యం సక్రమంగా అందడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. సిబ్బందితోపాటు వైద్యుల కొరత వేధిస్తోంది. చాలా మంది గ్రామాల్లో ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా వారు ఇష్టారీతిన ఫీజులు వసూలు చేస్తుండటంతో పేదలకు ఆర్థికంగా భారంగా మారుతోంది. ఆసుపత్రుల్లో అవసరమయ్యే మందులు లేవని రోగులు పెదవి విరుస్తున్నారు. విధిలేని పరిస్థితుల్లో చీటీలు రాయించుకొని వెళ్లి అవసరమున్న మందులను బయట దుకాణాల్లో కొంటున్నారు. ఆసుపత్రుల్లో మెరుగైన సదుపాయాలు కల్పించటంతోపాటు మందులకు ప్రభుత్వం నిధులు ఖర్చు చేస్తున్నా లాభం లేకుండాపోతోంది. జిల్లావ్యాపంగా 22 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పనిచేస్తున్నాయి. నిత్యం దాదాపు 2,300- 4,500 మంది వరకు బయటి రోగులు వివిధ ఆసుపత్రులకు వస్తుంటారు.

వేధిస్తున్న కొరత..

యాంటాసిడ్ గోళీలు, చర్మసంబంధ, కాలిన, దెబ్బ తగిలిన గాయాలకు రాసే ఆయింట్‌మెంట్, బి-కాంప్లెక్స్, బి12, ఇంజక్షన్ల కొరత ఉంది. గాయాలైనప్పుడు డ్రెస్సింగ్ చేయడానికి సరిపడా సామగ్రి లేదు. కళ్లు, చెవుల్లో వేసే చుక్కల మందు, అయోడిన్, దీర్ఘకాలిక రోగులకు బీపీ, షుగర్ వంటివి లేవు. వైద్యులు అందుబాటులో ఉండడం లేదని పలువురు వాపోతున్నారు. సకాలంలో వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నామంటున్నారు. సీజన్‌లో వైద్య సిబ్బంది గ్రామాలకు వచ్చి సమస్యలు తెలుసుకోవడం లేదని కొందరు చెబుతున్నారు. దీంతో చేసేది లేక ప్రైవేటు క్లినిక్‌లకు వెళుతున్నారు. చిన్న చిన్న అనారోగ్య సమస్యలకు రూ.500 వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. పెద్ద సమస్యలుంటే పట్టణాల్లోని ప్రైవేటు ఆసుపత్రులకు వెళుతున్నారు. దీంతో వైద్యం భారంగా మారుతోంది. సమయం వృథా అవుతోంది. ఎవరూ పట్టించుకోవటం లేదు.

ఇబ్బందుల్లేకుండా చూస్తాం..

– జీవరాజు, జిల్లా ఉప వైద్యాధికారి

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎక్కడా మందుల కొరత లేకుండా చూస్తున్నాం. ఒకటి, రెండు రకాలు సకాలంలో సరఫరా కాకపోవడంతో జాప్యం జరుగుతోంది. జ్వరాలు, గాయాలు ఇతర వైద్యానికి సంబంధించి ఉపయోగించే మందులు అందుబాటులో ఉన్నాయి. సీజనల్ వ్యాధుల ప్రభావం కావడంతో చాలా మంది అనారోగ్యానికి గురవుతున్నారు. సకాలంలో పరీక్షించి చికిత్స అందిస్తున్నాం.

అందుబాటులో ఉచిత ఆధార్ సేవలు



కేంద్రం వద్ద పద్మమ్మ, ఉపాధ్యాయులు

ఓగీపూర్(తాండూరు గ్రామీణ), న్యూస్‌టుడే: ఉచితంగా ఆధార్ నమోదు, మార్పులు చేర్పుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఓగీపూర్ మాజీ సర్పంచి పద్మమ్మ సూచించారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉచిత ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రధానోపాధ్యాయుడు రాముతో కలిసి మాజీ సర్పంచి సోమవారం ప్రారంభించారు. పిల్లల ఆధార్ నమోదు, అప్‌డేట్ సేవలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేలిముద్రల అప్‌డేట్, చరవాణి సంఖ్య అనుసంధానం, చిరునామా మార్పులకు కేంద్రాన్ని ఆశ్రయించాలని సూచించారు. ఉపాధ్యాయులు రాములు, బాలరాజ్, సునీల్ ఉన్నారు.